

తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్

నీటిని పొదుపుగా వాడుకోవాలి

బోరబండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపుగా వాడుకోవాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ప్రజలకు సూచించారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఎస్పీఆర్ హిల్స్ రాజీవ్‌గాంధీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో స్వరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జి స్వాతి, ఉపాధ్యాయురాలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు ఉచితాలు కాదు.. రాజకీయ రిజర్వేషన్లు కావాలి

- విశ్రాంత ఐపీఎస్ అధికారి జె.పూర్ణచందర్‌రావు

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీసీలకు కావాల్సింది ఉచితాలు, ఉపకర వేతనాలు కాదని, రాజకీయ రిజర్వేషన్లు కావాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి జె.పూర్ణచందర్‌రావు అన్నారు. తెలంగాణ కుమ్మర శాలివాహన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (టీకేసేవ) ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవిశంకర్, ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సంగెం సూర్యారావు, కోశాధికారి ఎన్.శ్రీనివాసరావు తదితరులతో కలిసి శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్రంలో తమ జనాభా 3.7 లక్షలు మాత్రమే ఉందని తప్పుడు లెక్కలు చెబుతున్నారని, కుమ్మర్లు రాజకీయంగా ఎదిగితేనే గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. కవయిత్రి మొల్ల జయంతితో పాటు శాలివాహన చక్రవర్తి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సంఘం అధ్యక్షుడు డాక్టర్ వి.రవిశంకర్ డిమాండ్ చేశారు. సంగెం సూర్యారావు మాట్లాడుతూ.. త్వరలోనే లక్ష మందితో కుమ్మరుల సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నగేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో స్కూల్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి

బచ్‌పన్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

అమీర్‌పేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బచ్‌పన్ అకడమిక్ హైట్స్ కూకట్‌పల్లి రామయ్యనగర్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ, యూకేజీ విభాగం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ నిర్వహించారు. పట్టాలను అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. వేడుకల్లో పాల్గొన్న పాఠశాల డైరెక్టర్స్ మురళీధర్ రెడ్డి, కె.ఇందులత రెడ్డి, ప్రిన్సిపాల్ ఆలూరి లక్ష్మి విద్యార్థులకు పట్టాలను అందించారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- అమీర్‌పేట డివిజన్ పరిధిలో రోడ్లను తవ్వి వదిలేసిన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పలు బస్తీల ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అమీర్‌పేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో రెండేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల విషయమై పలు మార్లు ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణం పేరుతో చాలా చోట్ల అంతర్గత రోడ్లను తవ్వి వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బల్కంపేటలోని గణేష్ మండపం వద్ద సీసీ రోడ్డు వేసేందుకు రెండు నెలల క్రితం పాత రోడ్డును తవ్వేశారు. అయితే ఇప్పటికీ రోడ్డు పనులు ప్రారంభించలేదు. కనీసం చెత్త తీసుకెళ్లే వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్థానికులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడంతో ఒక లేయర్ సిమెంట్ కలిపిన కంకర వేసి వదిలేశారు. మరోవైపు గాయత్రినగర్, బుద్ధనగర్, శ్రీనివాసనగర్ కాలనీల్లోని అంతర్గత రోడ్లు సైతం అధ్వానంగా మారాయి. ఇటీవల వివిధ శాఖల అధికారులతో కలిసి బుద్ధనగర్, గంగుబాయ్ బస్తీ, శ్రీనివానగర్ కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు రోడ్లు, పైప్‌లైన్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనే దానిపై మాత్రం స్పష్టత లేదు.



తాగునీటి పైప్‌లైన్ కోసం బల్కంపేటలో తవ్వేసిన రోడ్డు

ప్రజాధనం వృథా

బల్కంపేట సమీపంలోని రేణుక నగర్, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ ప్రాంతాల్లోని పలు వీధుల్లో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణం కోసం రోడ్లను తవ్వేశారు. అయితే పైప్‌లైన్ల నిర్మాణం అనంతరం ప్యాచ్ వర్క్ చేయకుండానే వదిలేశారు. దీంతో ఎక్కడ చూసినా గంతలే కనిపిస్తున్నాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే బల్కంపేట ప్రధాన రహదారిని సైతం ఇష్టానుసారంగా తవ్వి పైపులు వేస్తున్నారు. అయితే ముందు చూపు లేని కారణంగానే కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్డును ధ్వంసం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇలా చేయడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాడైన రోడ్లకు మరమ్మతులు చేయకపోగా బాగున్న రోడ్లను సైతం ధ్వంసం చేస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు పైపులైన్ పనులు రోజుల తరబడి జరుగుతుండటంతో ఇబ్బందికరంగా ఉంటుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రేణుక నగర్‌లో ప్యాచ్ వర్క్ చేయకుండా వదిలేసిన రోడ్డు

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి

రేణుక నగర్‌లో జనావాసాల మధ్య ఉన్న గ్యాస్ గోడౌన్‌ను వెంటనే తొలగించాలి. ఈ గోడౌన్‌కు ప్రతిరోజూ భారీ లోడుతో వస్తున్న లారీల వల్ల రోడ్డు కుంగిపోయి గుంతల మయాంగా మారుతోంది. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

- ఆరేళ్ల సునీల్, రేణుక నగర్

ఇబ్బందికరంగా ఉంటుంది

బుద్ధనగర్, గుంగుబాయ్ బస్తీల్లో అధ్వానంగా ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. గతులమయంగా మారిన రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. వర్షపు నీటి పైప్‌లైన్‌లు సరిగా లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

- భూలక్ష్మి, బుద్ధనగర్

ఐదు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

బల్కంపేట ఉజ్జయిని మహంకాళి ఆలయం వీధిలోని గణేష్ మండపం నుంచి శంకరప్ప రేషన్ షాపు వరకు చేపట్టాల్సిన సీసీ రోడ్డు పనులను మరో ఐదు రోజుల్లో ప్రారంభిస్తాం. సాంకేతిక కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

- సాయి సందీప్, డీఈ, అమీర్‌పేట

ట్రావెల్ టికెట్ల పేరుతో మోసం

పంజాగుట్ట, మార్చి22(ఆంధ్రజ్యోతి): ట్రావెల్ టికెట్ల పేరుతో ఓ నృత్యకళాకారిణిని మోసగించారు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో తన బృందంతో కలిసి బాలీ వెళ్లేందుకు ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ మోహిత్‌ను బేగంపేట.. కుందన్‌బాగ్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సంప్రదించింది. విమానం టిక్కెట్ల కోసం రూ.7.71 లక్షలు అతనికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా టిక్కెట్లు ఇవ్వక పోగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీస్తే అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె శనివారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఎస్ఆర్‌వోలు ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్ఆర్‌వో)ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భావిస్తోంది. ఉగాదిలోగా పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఆఫీసుల్లో ఈ విధానాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 148 ఎస్ఆర్‌వోల్లో ఈ విధానాన్ని తీసుకురానున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆరు ఎస్ఆర్‌వోలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతీయ కార్యాలయం(ఆర్‌ఓ), శంషాబాద్.. మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఉగాది నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్లను అందుబాటులోకి తేనున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకుని ఎస్ఆర్‌వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించనున్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు, వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నైటింగేల్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ, రెయిన్ బో హోమ్స్ కమ్యూనిటీ కేర్ ప్రోగ్రాం, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. మోకాలు, నడుము నొప్పితో బాధ పడుతున్న వారికి ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ సూచనలు చేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం

మాదాపూర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మెడికవర్ ఉమెన్స్ అండ్ చైల్డ్ హాస్పిటల్ సమీపంలోని బస్టాప్ వద్ద ఉన్న డ్రైనేజీలో శనివారం ఉదయం హాస్పిటల్ సెక్యూరిటీ సిబ్బంది నవజాత మగ శిశువును గుర్తించారు. ఈ విషయం ఆస్పత్రి వైద్యులుకు చెప్పగా వారు శిశువును పరీక్షించి మరణించినట్టు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన

బంజారాహిల్స్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య, అక్కడి సదుపాయాలు, రక్షణ వంటి అంశాలపై బంజారాహిల్స్ తాజ్ డెక్కన్‌లో యుకె- ఐర్లాండ్ ఎడ్యు ఫెయిర్-2025 నిర్వహించారు. యాధవు కన్సల్టింగ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల ప్రతినిధులు తాము అందిస్తున్న కోర్సులు, ఉపాధి అవకాశాలు, భద్రత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిర్వాహకుడు నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విదేశాల్లో నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో ఈ ఫెయిర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నగరాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న విజయలక్ష్మి

బంజారాహిల్స్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీలో రూ.1.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మురుగునీటి పైప్‌లైన్ నిర్మాణం, రూ.22 లక్షల వ్యయంతో సీవరేజీ పైప్‌లైన్ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురునీటి సమస్యల పరిష్కారానికి కీలక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మురునీటి నిల్వలు, ఓవర్ ఫ్లో, లీకేజీల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యంకు 'సర్వీస్ అబోవ్ సెల్ఫ్' అవార్డు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ సుబ్రమణ్యం

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాలియేటివ్ రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ సుబ్రమణ్యంకు బంజారాహిల్స్ రోటరీ క్లబ్ రోటరీ ఇంటర్నేషనల్ అత్యున్నత ప్రతిష్ఠాత్మక అవార్డు "సర్వీస్ అబోవ్ సెల్ఫ్"తో సత్కరించింది. బంజారాహిల్స్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అవార్డును డాక్టర్ సుబ్రమణ్యంకు అందించారు. ప్రపంచవ్యాప్తంగా 150 మందికి మాత్రమే ఇచ్చే ఈ అవార్డు వ్యక్తిగత రోటేరియన్లకు అత్యున్నత గౌరవంగా భావిస్తారు. రెయిన్‌బో గ్రూప్ ఆస్పత్రుల్లో అనస్థీషియాలజిస్ట్‌గా పనిచేసిన డాక్టర్ సుబ్రమణ్యం ప్రత్యేక పాలియేటివ్ కేర్ సెంటర్ స్పర్శ్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు. ఇందులో క్యాన్సర్ రోగులకు ఆహారం, మందులు, వసతి, వైద్య సంరక్షణతో సహా అన్ని సేవలు పూర్తి ఉచితంగా అందిస్తున్నారు. క్యాన్సర్‌తో తన తల్లిదండ్రులను కోల్పోయిన సుబ్రమణ్యం విదేశాల్లో ఉన్న పాలియేటివ్ కేర్ సౌకర్యాలను నగరంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. పాలియేటివ్ రంగంలో ఆయన సేవలను గుర్తించిన బంజారాహిల్స్ రోటరీ క్లబ్ ఆయనకు ప్రతిష్ఠాత్మక అవార్డు ఇచ్చి సత్కరించింది.

ఇఫ్తార్ సందడి



సనత్‌నగర్‌లోని డీఎస్ఎం కాలనీలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- బేగంపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

అన్ని రాష్ట్రాల అనుమతితోనే డీలిమిటేషన్ చేయాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నీలిమ

బేగంపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని రాష్ట్రాల అనుమతితోనే నియోజకవర్గాల డీలిమిటేషన్ జరగాలని ఏఐసీసీ సభ్యులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ డిమాండ్ చేశారు. శనివారం అమీర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో చెన్నైలో సంయుక్త కార్యాచరణ సంఘం తొలి సమావేశం జరిగిందని, ఈ సమావేశంలో పలు రాష్ట్రాలకు చెందిన 20 పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారన్నారు. 1972లో డీలిమిటేసన్ చేసిన అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ సీట్లను పెంచకుండానే ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. వాజ్‌పేయి సైతం అదే విధానాన్ని అనుసరించారని గుర్తుచేశారు.

చలివేంద్రం ప్రారంభం



సనత్‌నగర్ పరిధిలోని జెక్ కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ కొలను లక్ష్మి ప్రారంభించారు. వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ప్రజలు స్వచ్ఛందంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

- బేగంపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

నృత్యం.. నయనానందకరం



వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

- మాదాపూర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి)

బాలిక అదృశ్యం.. 9 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

- ఓ యువకుడితో వెళ్లినట్లు గుర్తింపు
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు 9 గంటల్లో ఛేదించారు. లైంగిక దాడికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరిలో నివాసముంటున్న దంపతుల కుమార్తె మెదక్‌లో అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. ఈ క్రమంలో తల్లిదండ్రుల వద్దకు వచ్చేందుకు జూబ్లీ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను మెదక్‌లో పరిచయమైన యువకుడు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఎంతకీ యువతి ఇంటికి చేరకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీని సేకరించిన పోలీసులు మెదక్ సమీపంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన యువకుడితో వెళ్లినట్లు గుర్తించారు. స్నాప్‌చాట్‌లో అతడి ప్రొఫైల్ వివరాలు సేకరించి ఆ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించారు. యువకుడి ఫోన్ నంబర్ తీసుకున్న పోలీసులు అతడు దమ్మాయిగూడలో ఉన్నట్లు గుర్తించి అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని బాలిక వారికి తెలిపింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును 9 గంటల వ్యవధిలోనే ఛేదించిన మారేడ్‌పల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

అర్ధరాత్రి.. అకాల వర్షం

● జలమయమైన లష్కర్‌లోని పలు ప్రాంతాలు

సికింద్రాబాద్/ బౌద్ధనగర్/ చిలకలగూడ/ మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండుటెండలతో వేడెక్కిన నగరవాసులను అకాల వర్షం అతలాకుతలం చేసింది. అర్ధరాత్రి పూట కురిసిన కుండపోత వర్షంతో లష్కర్‌లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీలు, బస్తీల్లో వర్షపునీరు గంటల నుంచి నిలిచిపోయి, బురద మయంగా మారాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో బస్తీలు, మురికివాడల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది.

● బౌద్ధనగర్ డివిజన్‌లో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో పలు బస్తీలు ముంపునకు గురయ్యాయి. వర్షపునీరు ఇళ్లలోకి రావడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. నాలాల నుంచి బస్తీల్లోకి వర్షపు నీరు రివర్స్ రావడంతో భారీగా బురద, చెత్త కొట్టుకొచ్చింది. న్యూ అశోక్ నగర్‌లో నాలా పక్కనే ఉన్న నివాసాల్లోకి భారీగా బురద నీరు చేరింది. ఎల్.నారాయణనగర్, అంబానగర్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో పాటు చెత్తాచెదారం కొట్టుకొచ్చింది. శనివారం ఆ బస్తీల్లో సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్, వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించి బస్తీలో పేరుకుపోయిన బురద, చెత్తతో పాటు వర్షపునీటిని పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన చెత్త, బురదను తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బస్తీలో పేరుకుపోయిన చెత్త, బురదను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారని, బస్తీవాసులు పలు ఇబ్బందులు పడుతున్నారని గ్రేటర్ వారాసిగూడ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.


విద్యుత్ సిబ్బందితో కార్పొరేటర్ సునీత

మెట్టుగూడలో విద్యుత్ అంతరాయం

మెట్టుగూడ డివిజన్‌లోని ఆలుగడ్డ బావి, చిలకలగూడ చౌరస్తా, హనుమాన్ ఆలయం వద్ద చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్థంభాలపై పడి విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. పార్క్ చేసిన కార్లపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. ఉదయం విద్యుత్ సరాఫరా లేకపోవడంతో డివిజన్ వాసులు ఇబ్బందులకు గురయ్యారు. మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత రెస్క్యూ, ఎలక్ట్రికల్ సిబ్బంది సహకారంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి సాధారణ పరిస్థితి నెలకొనడానికి చర్యలు చేపట్టారు. ఎటువంటి ప్రాణ హాని కలగలేదని కార్పొరేటర్ తెలిపారు.


కారుపై విరిగి పడిన చెట్టు కొమ్మలు


న్యూఅశోక్‌నగర్ బస్తీలో పేరుకుపోయిన బురద


అంబానగర్‌లో రోడ్లపై చెత్తాచెదారం

మహ్మద్‌గూడలో కార్పొరేటర్ హేమ పర్యటన

బౌద్ధనగర్: సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలో శనివారం కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నాలా పరిసరాల్లో నివశిస్తున్న ప్రజలను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. నాలాల్లో చెత్త వేయొద్దని, మురుగునీరు రివర్స్ వచ్చే అవకాశముందని తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు జాకీర్, కుమార్ పాల్గొన్నారు.


మహ్మద్‌గూడ నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ, అధికారులు

వర్షానికి కూలిన ఇంటి స్లాబ్

అడ్డగుట్ట: మధ్యరాత్రి కురిసిన భారీ వర్షానికి అడ్డగుట్ట సీ సెక్షన్ టీడీపీ కాలనీలో పోచమ్మ, సామ్యూల్ ఇంటి పై కప్పు కూలిపోయింది. కూతురు కృష్ణవేణితో పాటు పిల్లలపై స్లాబ్ దిమ్మెలు మీద పడి తీవ్ర గాయాలపాలుకాగా, వీరిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు టీపీసీసీ కేకేసీ సికింద్రాబాద్ జిల్లా చైర్మన్ గంట రాజుసాగర్, కాలనీ అధ్యక్షుడు నాగేష్, మంద సురేష్, మంద ప్రభాకర్, రమేష్, సంతోష్, లలిత ఘటనా స్థలానికి చేరుకున్నారు. గంట రాజసాగర్ మారేడుపల్లి తహసీల్దార్ బీమయ్యగౌడ్‌కు సమాచారం ఇవ్వడంతో ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.


వర్షానికి కూలిన స్లాబ్ ఇంటిని పరిశీలించిన కాంగ్రెస్ నేతలు, తహసీల్దార్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్

భారీ వర్షానికి కూలిన ఇంటిని పరిశీలించేందుకు అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ విషయంపై కార్పొరేటర్ వెంటనే మారేడుపల్లి తహసీల్దార్ బీమయ్యకు సమాచారం ఇచ్చిన అనంతరం ఈ విషయాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు దృష్టికి తీసుకొచ్చారు.

మార్కెట్‌లోకి హోండా ఎలక్ట్రిక్ బైక్

● ధర 90 వేలు ● క్యూసీ 1పేరుతో విడుదల

● ఫార్చ్యూన్ హోండా షోరూమ్‌లో బైక్ డెలివరీ ప్రారంభం


కస్టమర్లకు ఎలక్ట్రిక్ బైక్ కీను అందజేస్తున్న హోండా షోరూమ్ డైరెక్టర్లు

రాంపాల్‌పేట్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ద్విచక్ర వాహనాదారులకు నమ్మకమైన బ్రాండ్‌గా పేరుగాంచిన ప్రసిద్ధమైన హోండా కంపెనీ నుంచి అధునాతమైన ఫీచర్స్‌తో మొదటిసారిగా ఎలక్ట్రిక్ బైక్ మార్కెట్‌లో వచ్చింది. బెంగళూర్, పుణే, ఢిల్లీ, చండీఘర్‌లో ఇప్పటికే లాంచ్ అయినా కొత్త ఎలక్ట్రిక్ బైక్‌ను శనివారం సికింద్రాబాద్ ఫార్చ్యూన్ హోండా షోరూమ్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కొత్తగా లాంచ్ అయిన ఎలక్రిక్ బైక్‌లను 20మంది కస్టమర్లకు డెలివరీ చేశారు. అనంతరం ఫార్చ్యూన్ హోండా షోరూమ్ డైరెక్టర్లు నీరవ్ మోదీ, ఆశీష్‌మోదీ, సీఎఫ్‌వో రవిప్రకాశ్, జనరల్ మేనేజర్ సైమన్ మీడియా సమావేశంలో కొత్త ఎలక్రిక్ బైక్ విశేషాలను వివరించారు. క్యూసీ 1పేరుతో మార్కెట్‌లో వచ్చిన హోండా ఎలక్ట్రిక్ బైక్ కేవలం 1.5 యూనిట్ విద్యుత్ ఖర్చుతో ఒకసారి చార్జింగ్ చేస్తే 80కిలో మీటర్లు ప్రయాణించవచ్చన్నారు. దీని బ్యాటరీ 1.5కే డబ్ల్యూహెచ్ కెపాసిటీ ఉంటుందని, మోటర్ 1.8కిలో వాట్స్ ఉంటుందన్నారు. ఈ ఎలక్రిక్ బైక్‌లో రెండు స్పీడ్ మోడ్స్ ఉంటాయని, ఇకాన్ మోడ్‌లో 30కిలో మీటర్ల స్పీడ్‌తో వెళ్లవచ్చుని, అదే స్టాండర్డ్ మోడ్ స్విచ్ వేస్తే 50కిలో మీటర్ల వేగంతో బైక్‌ను నడపవచ్చన్నారు. ప్రస్తుత్తం ఐదు కలర్స్‌లలో బైక్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని, బైక్ కొనుగోలు చేసిన మొదటి ఏడాదిలో మూడు ఉచిత సర్వీసింగ్‌లు చేస్తామన్నారు. వారంటీ మూడు సంవత్సరాలు లేదా 50వేల కిలో మీటర్ల వరకు వర్తిస్తుందన్నారు. అదే రూ. 9,900 చెల్లించి కేర్‌ప్లస్ ప్లాన్ తీసుకుంటే మూడు ఉచిత సర్వీస్‌లతో పాటు అదనంగా 8 ఉచిత సర్వీసింగ్‌లు వస్తాయని, వారంటీ ఐదేళ్లు లేదా 70వేల కిలో మీటర్లు వరకు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హోండా బైక్ వినియోగదారులు, హోండా షోరూమ్ టెక్నిషియన్, మార్కెటింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం వారాసిగూడ జామ్‌జామ్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఉపవాస దీక్షలను పవిత్రంగా భావిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


● శ్రీనివాస్‌నగర్ మసీదు వద్ద శనివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న పీసీసీ ఉపాధ్యక్షుడు ఆదం సంతోష్‌కుమార్, యువజన కాంగ్రెస్ నాయకుడు ఆదం సృజన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షకీల్ తదితరులు
- సికింద్రాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి)


● బోయినపల్లిలో శనివారం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, ఇబ్రహీం, బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జమీల్, హైదర్, సదానంద్ తదితరులు
- సికింద్రాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

వీడిన మిస్టరీ

● బాలిక అదృశ్యం కేసును 9 గంటల్లోపు ఛేదించిన పోలీసులు
● నిందితుడిపై పోక్సో కేసు,
● అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు 9 గంటల్లోపు ఛేదించారు. లైంగిక దాడికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతంలో నివాసముంటున్న దంపతుల కుమార్తె మెదక్‌లో అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. కాగా తల్లిదండ్రుల వద్దకు బయలుదేరింది. జూబ్లీ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను మెదక్‌లో పరిచయమైన యువకుడు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఎంతకీ యువతి ఇంటికి చేరకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు తమకు లభించిన సీసీ ఫుటేజీని తల్లిదండ్రులకు చూపించారు. వారిచ్చిన సమాచారంతో మెదక్ సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. స్నాప్‌చాట్‌లో అతడి ప్రొఫైల్ వివరాలు సేకరించారు. ఆ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించి యువకుడి బాబాయ్ సెల్ నంబర్ తీసుకున్నారు. కాల్ చేసి యువకుడు వద్ద ఉన్న మొబైల్ నంబర్ అనంతరం దమ్మాయిగూడలో బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని బాలిక వారికి తెలిపింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే కేసును 9 గంటల వ్యవధిలోనే ఛేదించిన మారేడ్‌పల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ట్రావెల్ టికెట్ల పేరుతో మోసం

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ట్రావెల్ టికెట్ల పేరుతో ఓ నృత్యకళాకారిణిని మోసగించారు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో తన బృందంతో కలిసి బాలీ వెళ్లేందుకు ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ మోహిత్‌ను బేగంపేట.. కుందన్‌బాగ్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సంప్రదించింది. విమానం టిక్కెట్ల కోసం రూ.7.71 లక్షలు అతనికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా టిక్కెట్లు ఇవ్వక పోగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీస్తే అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె శనివారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

● పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఎస్ఆర్‌వోలు ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్ఆర్‌వో)ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భావిస్తోంది. ఉగాదిలోగా పైలెట్ ప్రాజెక్టు కింద 17ఆఫీసుల్లో ఈ విధానాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 148 ఎస్ఆర్‌వోల్లో ఈ విధానాన్ని తీసుకురానున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆరు ఎస్ఆర్‌వోలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతీయ కార్యాలయం(ఆర్‌ఓ), శంషాబాద్.. మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఉగాది నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్లను అందుబాటులోకి తేనున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి ఆ డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకుని ఎస్ఆర్‌వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అయితే సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

అడ్డగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తరగతి తగ్గ విద్యా సామర్థ్యాలు అందడంలేదని ఎంవీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఏవీఎం స్వామి అన్నారు. శనివారం అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య సామర్థ్యాలు అందడంలేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్ర ఇప్పటికీ జరగడంలేదని మండలంలో బడులకు 289 మంది పిల్లలు బాలకార్మికులుగా ఉన్నారన్నారు. వీరిని పనుల నుంచి విముక్తి చేసి బాలకార్మిక రహిత మండలంగా తీర్చి దిద్దాలని డిమాండ్ చేశారు. కో-కన్వీనర్ రమాదేవి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించి ఉచిత నిర్బంధ విద్యా హక్కుల చట్టం అమలు పరిచి పిల్లలకు హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు రెమీడియల్ సెంటర్లను సందర్శించి సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, సీఆర్‌పీఎఫ్ కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, కాంపల్లి శ్రీనివాస్, గోపి, కొమురయ్య, రమాదేవి, లక్ష్మి, బాలమణి, షీలా, పద్మ, ఎంపీ ఫౌండేషన్ ప్రతినిధులు సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య, మైథిలి, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, శ్రీదేవి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

నేడూ ఆస్తిపన్ను చెల్లించొచ్చు

సికింద్రాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగియడానికి వారం రోజులు మాత్రమే ఉండడంతో ఆదివారం కూడా ఆస్తిపన్ను విభాగం పని చేస్తోందని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్ రావు తెలిపారు. తనతోపాటు వాల్యుయేషన్ అధికారులు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌కలెక్టర్లతో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఆవరణలోని సిటిజెన్ చార్టర్ కార్యాలయం కూడా పని చేస్తోందని తెలిపారు. ఆస్తిపన్ను చెల్లించేవారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించడం ద్వారా నగరాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.


సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు


తిరుమలగిరి టీచర్స్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కంటోన్మెంట్ బోర్డు ఆస్తిపన్ను శిబిరానికి స్పందన వచ్చింది. 7వ వార్డులోని టీచర్స్ కాలనీ, ఆర్బీసీ కాలనీకి చెందిన పౌరులు ఆస్తిపన్ను, నీటి పన్ను సైతం చెల్లించడానికి ముందుకు వచ్చారు.
- సికింద్రాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

రహదారి విస్తరణను '100'కు కుదించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సతీష్‌గుప్తా తదితరులు

సికింద్రాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ క్యారిడార్ నిర్మాణానికి రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ ప్రతిపాదనను 200 అడుగులకు బదులుగా 100 అడుగులకు కుదించాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ చైర్మన్ తెలుకుంట సతీష్‌గుప్తా, జేఏసీ సభ్యులు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. రెండు వందల మేర రోడ్డు విస్తరణ చేయడం వల్ల వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయని ఆయనకు వివరించారు. రోడ్డు విస్తరణ ప్రతిపాదన గురించి తెలియగానే ఇప్పటికే చాలా మంది కిరాయిదారులు ఖాళీ చేశారని తెలిపారు. ఈనేపథ్యంలో ఇంటి పన్ను పెంచడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పూర్తయ్యే వరకు ఇంటి పన్ను వేయవద్దని కలెక్టర్‌ను కోరారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉప్పలంచ అమర్‌నాథ్, సూర్యప్రకాష్‌రెడ్డి, మినీగండ్ల శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటినే తాగమంటారా?

● ఫిర్యాదు చేసి 20 రోజులవుతున్నా పట్టించుకోని అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 20 రోజులుగా దుర్వాసనతో కూడిన మురుగు నీళ్లు వస్తున్నాయి. పరిష్కరించేవారు లేదరు. బకెట్లలో నీళ్లు పట్టి మురుగుతో ఉండగా ఫొటోలు తీసి మరీ వాటర్ బోర్డు అధికారులకు 20 రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న వాటర్ బోర్డు అధికారులు 1503 టోకెన్ నెంబర్ జారీ చేశారు. కానీ ఇప్పటి వరకు కలుషిత నీటి సరఫరా సమస్య ఆగలేదు. ప్రతిరోజూ కలుషిత నీరే సరఫరా అవుతోంది. ఇదేదో ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు. సికింద్రాబాద్‌లోని వెంకట్‌నగర్.. తుకారాంగేట్ వాసులు 20రోజులకు పైగా పడుతున్న ఇబ్బందులు. స్థానిక వాటర్‌బోర్డు అధికారులెవ్వరూ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. మురుగు నీటి సరఫరా సమస్యకు పరిష్కారాన్ని వెతకడం లేదు. ఈ కాన్ నెంబర్‌తో 072233071 ఫిర్యాదు చేసిన మొబైల్ నెంబర్‌కు మాత్రం సమస్య పరిష్కారం చేయకుండానే.. పరిష్కారం చేసిన్నట్టుగా వాటర్‌బోర్డు అధికారులు మెస్సెజ్ పంపుతున్నారు. చివరకు ఫిర్యాదును క్లోజ్ చేశారు. వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు స్పందించి కలుషిత నీరు సరఫరా చేయకుండా చర్యలు తీసుకోవాలని, మురుగునీటినే తాగమంటారా? అని తుకారాంగేట్ వాసులు కోరుతున్నారు.


తుకారాంగేట్‌లో సరఫరా అవుతున్న కలుషిత నీరు

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం


శిరిషా

బౌద్ధనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బట్టలషాపులో పనిచేయడానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఎస్సై సబితా తెలిపిన వివరాల ప్రకారం.. నామాలగుండుకు చెందిన బి.శిరిషా (19) స్థానికంగా ఉండే ఎం.ప్రసాద్ ఐదునెలల క్రితం విజయవాడ కనకదుర్గ ఆలయంలో వివాహం చేసుకున్నారు. ఈ వివాహం శిరిషా తల్లితండ్రులకు ఇష్టం లేదు. దీంతో శిరిషా, ప్రసాద్ నామాలగుండులో ఓ ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసముంటున్నారు. శిరిషా రెండునెలల గర్భిణి. స్థానికంగా ఉండే బట్టల షాపులో సేల్స్ గర్ల్ శిరిషా. ఈనెల 20న షాపునకు వెళ్లుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన శిరిషా ఇంటికి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో శిరిషా కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. భార్య కనిపించడం లేదని భర్త శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పార్శీగుట్టలో మద్యానికి బానిసైన వ్యక్తి..


అప్పల స్వామి

బౌద్ధనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి అదృశ్యమయ్యాడు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పార్శీగుట్ట శ్రీనివాస్‌నగర్‌కు చెందిన డి.అప్పలస్వామి(41) మద్యానికి బానిసైయ్యాడు. ఫిబ్రవరి 26న ఇంటి నుంచి వెళ్లిన అప్పలస్వామి తిరిగి రాలేదు. భార్య సరస్వతి పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం రాత్రి తనభర్త కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ ఆస్పత్రిలో ట్రాక్టర్ డ్రైవర్..

బౌద్ధనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి వచ్చిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ అదృశ్యమయ్యాడు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షాద్‌నగర్ ఎల్లంపల్లి గ్రామానికి చెందిన వి.మల్లయ్య(47) ట్రాక్టర్ డ్రైవర్. మల్లయ్య కొద్దిరోజులుగా ఫైల్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 15న చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. 16వ తేదీ తెల్లవారు జామున మల్లయ్య గాంధీ ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. మల్లయ్య కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. శుక్రవారం రాత్రి కుమారుడు వి.ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అడ్డగుట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెంది ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన సంతోష్(38)కు భార్య పిల్లలు ఉన్నారు. అడ్డగుట్ట మసీద్ పక్కనే పార్కింగ్ చేసి ఉన్న ఆటోలో సంతోష్ మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ ఎస్సై రామకృష్ణ అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా నిర్మించిన భవనాల కూల్చివేత

సికింద్రాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం కన్నెర్ర చేసింది. అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాలను కూల్చివేస్తోంది. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని పద్మారావునగర్‌లో ఓ కట్టడాన్ని శుక్రవారం నేలమట్టం చేసిన సంగతి విదితమే. అలాగే నల్లగుట్ట మటన్ మార్కెట్ వద్ద నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. రెండు భవనాల నిర్మాణానికి అనుమతి తీసుకున్న ఓ వ్యక్తి వాటిని కలిపి ఒకే భవనంగా నిర్మిస్తున్నారు. దీనిపై పొరుగునే ఉన్న వ్యక్తి ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దాంతో యజమాని న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. కాగా కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ భవనాన్ని కూల్చివేస్తున్నట్టు అధికారులు తెలిపారు.


అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ కన్నెర్ర